హైదరాబాద్
18-9-2023
సంపుటి:08
సంచిక: 358
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



## సమైక్యతా స్ఫూర్తితో.. బంగారు తెలంగాణ

### రాష్ట్రంలో అద్భుత పరిపాలన సంక్షేమం, అభివృద్ధిలో నం.1

### మంత్రులు సబితారెడ్డి, మల్లారెడ్డి ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

### కలెక్టరేట్లలో మంత్రుల జాతీయ పతాకావిష్కరణ

రంగారెడ్డి, సెప్టెంబర్ సమైక్యతా స్ఫూర్తిని చాటి బంగారు తెలంగాణ కలను సాకారం చేసుకుందామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి అందేలా చూడటంతో పాటు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ ముందుకు సాగుదామన్నారు. జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదివారం కొంగర కలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ నేలపై జరిగిన అనేక పోరాటాలు, అనతికాలంలోనే జిల్లాలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రసంగించారు.

**వీరయోధుల త్యాగ ఫలితమే స్వేచ్ఛ తెలంగాణ**

భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగమైన రోజును జాతీయ సమైక్యతా దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్నదని మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. వేలాది మంది ప్రాణ త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ తెలంగాణ అని పేర్కొన్నారు. స్వామి రామానంద తీర్థ, సర్దార్ జమలాపురం కేశవరావు, వట్టికోట అళ్వార్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కుమ్రం భీం, రావి నారాయణ రెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి, నల్లా నర్సింహులు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, దేవులపల్లి వెంకటేశ్వరరావులకు ఈ సందర్భంగా నివాళు లర్పించారు. రచనలతో ఉత్తేజాన్ని, ఉద్వేగాన్ని నింపిన సురవరం ప్రతాపరెడ్డి, కాళోజి, మగ్దూం మొహియొద్దీన్, షోయబుల్లాఖాన్, బండి యాదగిరి, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతుల స్ఫూర్తిదాయక కృషిని స్మరించుకుందామన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి సారథ్యం వహించి పద్నాలుగేండ్లు అవిశ్రాంత పోరాటం చేశారన్నారు. మొక్కవోని దీక్షతో చేపట్టిన ఉద్యమం ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం సాకారమైందన్నారు.

**స్వరాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమం..**

సంక్షేమం, అభివృద్ధి పరంగా రంగారెడ్డి జిల్లా దూసుకెళు_న్నదని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను

## కరువు నేలకు.. 'కృష్ణా'భిషేకం

కృష్ణా జలాలతో జలకళను సంతరించుకున్న నంద్యాల జిల్లా డోన్ మండలం వెంకటాపురం చెరువు

రేపు 77 చెరువులకు కృష్ణా జలాలు.. జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్

పాదయాత్రలో ఇచ్చిన మరో హామీ అమలుకు శ్రీకారం

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని దుర్భిక్ష ప్రాంతాల్లో 10,394 ఎకరాలకు సాగునీరు

పెరగనున్న భూగర్భ జలమట్టం .. బోరు బావుల కింద విస్తారంగా పంటల సాగు


ప్రజల జీవన ప్రమాణాలు మెరుగై వలసలకు బ్రేక్ .. ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ మలుపు అంటున్న సామాజికవేత్తలు

పాదయాత్రలో వైఎస్ జగన్ హామీ ఇవ్వడంతో 2018లో హడావుడిగా ఆ పథకాన్ని చేపట్టిన టీడీపీ సర్కార్

జీవో ఇచ్చి కొబ్బరికాయ కొట్టి చేతులు దులుపుకున్న వైనం

అధికారంలోకి వచ్చాక రూ.224.31 కోట్లతో ఈ పథకాన్ని పూర్తి చేసిన సీఎం జగన్

పచ్చటి పంటలతో కోనసీమను తలపిస్తున్న కరువు నేల



కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పశ్చిమ మండలాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి ఏ.రామగోపాలరెడ్డి: రాష్ట్రంలో అత్యంత కరువు పరిస్థితులకు, వలసులకు మరుపేరైన కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పశ్చిమ మండలాలు కృష్ణమ్మ స్పర్శతో పరవశించిపోతున్నాయి. ఇన్నాళ్లూ కరువుతో తల్లడిల్లిన నేలతల్లిని ఇప్పుడు కృష్ణా జలాలు అభిషేకిస్తుండటంతో పులకరించిపోతోంది. ట్రయల్ రన్ (ప్రయోగాత్మకంగా నడిపించడం) ద్వారా కృష్ణా జలాలను నింపిన చెరువుల కింద రైతులు పంటలు సాగు చేయడంతో నిన్నటి దాకా నోళ్లు తెరిచిన బీడు భూములు ఇప్పుడు కోనసీమను తలపిస్తున్నాయి.

2లో

## ఖైరతాబాద్‌లో ఎత్తైన మట్టి గణపతి

నేడే వినాయక చవితి..
ఉ. 11.06 నిమిషాలకు తొలిపూజ

75 అడుగుల జంధ్యం, కండువా, గరిక మాలాంకరణ

300 మంది పోలీసు సిబ్బంది, 70 సీసీ కెమెరాలతో నిఘా

నగరమంతా ఏకదంతుడి సందడి.. ముస్తాబైన మండపాలు

2లో

## చరిత్రను వక్రీకరించిన వారికి గుణపాఠమే!

స్వాతంత్ర్య పోరాట చరిత్రను వక్రీకరించారు.. దాన్ని మోదీ సరిచేశారు

నిజాం పాలనలో ఇక్కడి ప్రజలు నరకం చూశారు

సర్దార్ పటేల్ లేకపోతే అంత త్వరగా విముక్తి కలిగేది కాదు

విమోచన చరిత్ర దేశ ప్రజలకు తెలియాలి: కేంద్ర హోం మంత్రి షా

వారివి ఓటుబ్యాంకు రాజకీయాలు.. బీఆర్ఎస్‌పై పరోక్ష విమర్శలు

పరేడ్‌గ్రౌండ్ వేడుకలో జాతీయ జెండా ఆవిష్కరణ

హైదరాబాద్: స్వాతంత్ర్య పోరాట చరిత్రను ఆనాటి పాలకులు వక్రీకరించారని, దాన్ని ప్రధాని మోదీ సరిచేశారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. చరిత్రను వక్రీకరించిన వారికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## లోకేశ్‌నూ అరెస్టు చేస్తే.. బరిలోకి బ్రాహ్మణి!

ప్రత్యామ్నాయ ప్రణాళికతో టీడీపీ సిద్ధం

బాబు, లోకేశ్‌లను దీర్ఘకాలం

రిమాండ్‌లో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం?

మళ్లీ తెరపైకి ఫైబర్ గ్రిడ్ కేసు

తన శాఖ పరిధిలో లేకున్నా

లోకేశ్ చుట్టూ 'ఫైబర్' కథలు

ఆయననూ అరెస్టు చేస్తారనే ప్రచారం

తప్పుడు ఆరోపణలతో నలుగురి అరెస్టు

అందరికీ బెయిలు ఇచ్చిన హైకోర్టు

రెండేళ్ల కిందటే ఆగిపోయిన దర్యాప్తు

అయినా.. మళ్లీ పావులు కదుపుతున్న సీఐడీ



దీటుగా ఎదుర్కోవాలని టీడీపీ నిర్ణయం

'చంద్రబాబు అరెస్టు శాంపిల్ మాత్రమే.

తర్వాతి వంతు లోకేశ్‌దే!' - మంత్రి గుడివాడ అమర్నాథ్

(అమరావతి – ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు నే కాదు... లోకేశ్‌నూ జైలుకు పంపిస్తాం!' ఇది వైసీపీ నేతలు, ప్రభుత్వ పెద్దలు పదేపదే చేస్తున్న ప్రకటన! అంతేకాదు... చంద్రబాబు, లోకేశ్‌లను వరుస కేసుల్లో ఇరికించి, అక్రమంగా అరెస్టు చేసి, ఎన్నికల దాకా రిమాండులోనే ఉంచాలనే వ్యూహం రచిస్తున్నట్లు ఇప్పటికే జోరుగా ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే టీడీపీ ఏం చేస్తుంది? అధినేత, ఆయన కుమారుడు ఇద్దరూ అరెస్టయితే ఎన్నికల సమయంలో ఏం చేయాలి? విశ్వసనీయ సమాచారం ప్రకారం... తెలుగుదేశం పార్టీ 'ప్లాన్-బీ' సిద్ధం చేసుకుంది. చంద్రబాబుతోపాటు లోకేశ్‌నూ అరెస్టు చేస్తే...

2లో



## బీఆర్ఎస్ గద్దె దిగడం ఖాయం: రాహుల్



### తుక్కుగూడ 'విజయభేరి' సభలో కాంగ్రెస్ అగ్రనేత ప్రసంగం

కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కుట్ర

ఆ మూడు పార్టీలూ ఒకటే..కలిసే పనిచేస్తున్నాయి

ప్రజల సొమ్మును దోచుకుంటున్నబీఆర్ఎస్, సీఎం కేసీఆర్‌పై చర్యలేవి?

ప్రజల ఆకాంక్షలను గుర్తించి కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది

కానీ అన్ని ప్రయోజనాలూ ఒక్క కేసీఆర్ కుటుంబానికే అందుతున్నాయి

మేం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు హామీలు అమలు చేస్తాం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నా కల అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పనిచేస్తుంది: సోనియాగాంధీ

ప్రజలంతా తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి

మహిళల సాధికారత కోసం 'మహాలక్ష్మి' పథకం అమలు చేస్తామని హామీ

2లో

హైదరాబాద్: తెలంగాణలో బీఆర్ఎస్‌కు బీజేపీ, ఎంఐఎం సహా ఎవరు మద్దతుగా వచ్చినా సరే వంద రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోవడం ఖాయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కేవలం బీఆర్ఎస్‌తోనే కొట్లాడటం లేదని.. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తోందని చెప్పారు. ఈ మూడు పార్టీలు కలిసే పనిచేస్తున్నాయని.. కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఆదివారం సాయంత్రం జరిగిన 'కాంగ్రెస్ విజయభేరి'సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. అటు కేంద్రంలోని



# బీఆర్ఎస్ గద్దె దిగడం ఖాయం: రాహుల్

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ, మోదీ ప్రభుత్వ విధానాలతోపాటు రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో బీజేపీ విస్తరింపజేస్తున్న హింసను, విద్వేషాన్ని అడ్డుకుని ప్రేమను పంచేందుకు తాము 'విద్వేషపు మార్కెట్లో ప్రేమ దుకాణం' తెరిచామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది తామేనని.. ఆ వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. విజయభేరి సభలో రాహుల్ గాంధీ ప్రసంగం ఆయన మాటల్లోనే.. "బీఆర్ఎస్ అంటే బీజేపీ రిష్తేదార్ (బంధువుల) సమితి. పార్లమెంటులో బీజేపీకి అవసరమైన ప్రతీ సందర్భంలో బీఆర్ఎస్ మద్దతు పలకడం నా కళ్లతో చూశాను. కిసాన్ బిల్లులు, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు, జీఎస్టీ తదితరాలపై నరేంద్ర మోదీ ఒక్క సైగతోనే బీఆర్ఎస్ మద్దతు పలికింది. ఈ రోజు తుక్కుగూడ బహిరంగ సభ జరుపుతుంటే ఆ మూడు పార్టీలు ఒకేసారి సభలు నిర్వహించి కాంగ్రెస్‌కు అంతరాయం కలిగించాలనుకున్నారు. కానీ తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉండటం వల్ల మా బహిరంగ సభ విజయవంతమైంది. రాజకీయాల్లో ఎవరితో కొట్లాడుతున్నామో, మనకు వ్యతిరేకంగా నిలిచే శక్తులేంటో పూర్తి అవగాహనతో ఉండాలి. ఆరు గ్యారంటీ పథకాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాహుల్ గాంధీ, ఖర్గే. చిత్రంలో మధుయాష్కీ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, దామోదర రాజనర్సింహ, అశోక్ గెహ్లాత్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, కేసీ వేణుగోపాల్, ఠాక్రే, భట్టి విక్రమార్క, పొన్నాల లక్ష్మయ్య, జీవన్‌రెడ్డి తదితరులు

**కేసీఆర్‌పై కేసులు పెట్టడం లేదేం?**

కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు కొత్త మార్గాల కోసం బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం మూడు పార్టీలు పరస్పరం ఫోన్లు చేసుకుంటాయి. మేం ఎక్కడ బీజేపీతో కొట్లాడుతామో ఆయా రాష్ట్రాలకు ఎంఐఎం వచ్చి అంతరాయం కలిగిస్తుంది. ఈ మూడు పార్టీలు భాగస్వాములుగా మారి ప్రజలకు నష్టం చేస్తున్నాయి. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలను అడ్డు పెట్టుకుని ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేస్తు న్న మోదీ ప్రభుత్వం.. అవినీతిలో అన్ని రికార్డులు బద్దలుకొట్టిన కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఒక్క కేసూ పెట్టడం లేదేం? ఎంఐఎం నేతలపైనా ఎలాంటి కేసులు పెట్టడం లేదేం? కేవలం విపక్షాలపైనే దాడులు ఎందుకు జరుగుతున్నాయి? కేసీఆర్‌ను, ఎంఐఎంను తనవారిగా భావిస్తున్నందునే ప్రధాని మోదీ వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదు.

**ఒక్క కుటుంబం కోసం ఇవ్వలేదు**

కేసీఆర్ లాభం కోసం, ఒక్క కుటుంబం కోసం మేం తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వలేదు. పేదలు, రైతులు, మహిళలు, కూలీల కోసం తెలంగాణ ఇచ్చాం. కానీ ఇక్కడ అన్ని ప్రయోజనాలు సీఎం కుటుంబానికే అందుతున్నాయి. కానీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల గురించి ఆలోచిస్తుంది. ఎన్ని అవాంతరాలు వచ్చినా ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియా తెలంగాణ ఇచ్చారు. ఇటీవలే పొరుగు రాష్ట్రం కర్ణాటకలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నెరవేర్చింది. తెలంగాణలో ఇచ్చిన ఆరు హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అమలు చేస్తాం" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నా కల: సోనియా**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూడటం తన కల అని, తెలంగాణలోని అన్ని వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ చెప్పారు. కాంగ్రెస్‌కు ప్రజలంతా మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం తుక్కుగూడ విజయభేరి సభలో సోనియాగాంధీ మాట్లాడారు. కాంగ్రెస్ గ్యారంటీల్లో ఒకటైన 'మహాలక్ష్మి' పథకాన్ని ప్రకటించిన ఆమె.. కొన్ని నిమిషాల్లోనే తన ప్రసంగాన్ని ముగించారు. "నా సహచర నేతలతో కలసి తెలంగాణ వంటి గొప్ప రాష్ట్రానికి జన్మనివ్వడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ రాష్ట్రాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం ఇప్పుడు మా విధి. ఈ చారిత్రక దినోత్సవ సందర్భంలో మీతో ఉన్నందుకు ఎంతో సంతోషిస్తున్నాను. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆరు గ్యారంటీలు ఇస్తున్నాం. అందులో 'మహాలక్ష్మి' పథకం మొదటిది. తెలంగాణ సోదరీమణులకు సాధికారత కల్పించే ఈ ప్రకటన చేస్తున్నందుకు ఎంతో సంతోషిస్తున్నా. 'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు ప్రతీ నెలా రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తాం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను ఇవ్వబోతున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సులలో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం" అని సోనియా హామీ ఇచ్చారు. తెలంగాణ సోదర సోదరీమణులారా అంటూ ప్రసంగం ప్రారంభించిన సోనియా.. 'జై హింద్.. జై తెలంగాణ' నినాదంతో ముగించారు.

# చరిత్రను వక్రీకరించిన వారికి గుణపాఠమే!



తెలంగాణ విమోచన చరిత్రను కూడా కొంతమంది వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తోందని, అందుకే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని పరోక్షంగా విమర్శించారు.. ఇలాంటి రాజకీయాలను దేశప్రజలు క్షమించబోరన్నారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ విమోచన దినోత్సవంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ విమోచన చరిత్ర దేశ ప్రజలకు తెలియాల్సి ఉందని,. 75 ఏళ్లుగా ఏ ప్రభుత్వం కూడా ఇంతటి చరిత్రాత్మక కార్యక్రమాన్ని నిర్వహించలేదన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి మూడు కారణాలున్నాయని, అవి.. యువతకు, భవిష్యత్తు తరాలకు ఆనాటి మహోద్యమం గురించి తెలియజేయడం.. అమరులకు నివాళు ల్పపంచడం, వారు కలలుగన్న రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవడం అని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా 399 రోజులపాటు తెలంగాణలో నిజాం ప్రైవేటు సైన్యమైన రజాకార్ల అరాచకం కొనసాగిందని పేర్కొన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం రాకుండా స్వతంత్ర్య రాజ్యంగా ఉంటే.. భరతమాత కడుపులో క్యాన్సర్ ఉన్నట్లేనని గుర్తించిన నాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్.. తెలంగాణను రజాకార్లనుంచి విముక్తి చేయించారని, పటేల్ లేకపోతే.. తెలంగాణకు ఇంత త్వరగా విముక్తి లభించకపోయేదన్నారు. నిజాం పాలనలో క్రూరమైన చట్టాలు ఉండేవని, ఫలితంగా ఆ పాలనలో నాటి తెలంగాణ ప్రజలు నరకయాతన అనుభవించారని చెప్పారు. ఆయన పాలనలో క్రూర చట్టాలుండేవన్నారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పోలీసు చర్యకు పటేల్ ఆదేశించారని తెలిపారు. నిజాం పాలన నుంచి విముక్తి కోసం ఉస్మానియాలో వందేమాతరం ఉద్యమం, ఆర్య సమాజ్, హిందూ మహాసభ వంటి సంస్థలెన్నో కలిసి ఉద్యమాలు చేశాయి. రావినారాయణరెడ్డి, మర్రి చెన్నారెడ్డి, పీవీ నర్సింహారావు, కాళోజీ నారాయణరావు వంటి ఎంతోమంది ఆనాడు పోరాటం చేశారన్నారు. కాగా ప్రధాని మోదీ కృషివల్లే చంద్రయాన్-3 విజయవంతమైందని, జీ20ని జీ21గా మార్చిన ఘనత మోదీది అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఖైరతాబాద్‌లో ఎత్తైన మట్టి గణపతి

(మొదటి పేజీ తరువాయి)

విఘ్నాలను తొలగించే లంబోదరుడు వాడవాడలా కొలువుదీరనున్నాడు. ఖైరతాబాద్ చరిత్రలోనే ఎత్తైన మట్టి గణపతి.. 63 అడుగుల దశ మహా గణపతికి సోమవారం వినాయకచవితి పర్వదినాన ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నారు. ఉదయం 11.06 నిమిషాలకు తొలిపూజ మహాక్రతువును ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ఈ ఏడాది నగరవాసులు పర్యావరణహిత మట్టి ప్రతిమలకే ఎక్కువగా జై కొట్టారు. తమ ఇండ్లల్లో మట్టి గణపతులను పూజించేందుకే ప్రాధాన్యమిస్తున్నట్లు మార్కెట్ వర్గాల నిపుణులు చెబుతున్నారు. మరోవైపు మండపాల వద్ద విద్యుత్ భద్రతా విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

చరిత్రలో తొలిసారిగా ఖైరతాబాద్‌లో ఏర్పాటు నేడు దశ మహా విద్యా గణపతికి ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవం ఉదయం 11:06 గంటలకు తొలి పూజ హాజరుకానున్న గవర్నర్ తమిళిసై, మంత్రి తలసాని, ఎమ్మెల్యే దానం 75 అడుగుల జంధ్యం, కండువా, గరిక మాలాంకరణ 300మంది పోలీసు సిబ్బంది, 70సీసీ కెమెరాలతో నిఘా ప్రతిఒక్కరినీ తనిఖీ చేసిన తర్వాతే దర్శనానికి అనుమతి దర్శనానికి 30లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 17 : చరిత్రలోనే తొలిసారి.. 63 అడుగుల ఎత్తైన మట్టి ప్రతిమను ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించారు. ఈ ఏడాది శ్రీ దశ మహా విద్యాగణపతిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. నేడు వినాయక చవితి పర్వదినాన వేద మంత్రోత్ఛరణల మధ్య స్వామి వారికి ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించనున్నారు. ఈ మహాక్రతువుకు ఉదయం 11:06 గంటలకు తొలి పూజను గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి నిర్వహిస్తారు.

**దశ మహా విద్యా గణపతి విశిష్టతలు**

63 అడుగుల ఎత్తు.. 28 అడుగుల వెడల్పుతో ఏడు పడగల ఆదిశేషుడి నీడలో సరస్వతి, వారాహీ మాతలతో శ్రీ దశ మహా విద్యా గణపతి దశ హస్తాలతో కొలువు దీరనున్నారు. స్వామి వారిని కొలిస్తే బహుళ ఫలితాలు వస్తాయని దివ్యాజ్ఞాన సిద్ధాంతి తెలిపారు. వచ్చే ఏడాది క్రోది నామ సంవత్సరంలో కలిగే విఘ్నాలను తొలగించుకోవచ్చని చెప్పారు. అలాగే కుడివైపు కొలువుదీరిన పంచముఖ లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకుంటే పంచనారసింహ క్షేత్రాలను దర్శించిన ఫలితం దక్కుతుందని, ఎడమ వైపు శివుడి రుద్రావతారమైన శ్రీ వీరభద్రుడిని దర్శించుకుంటే ఇతి బాధలు తొలగిపోతాయని పేర్కొన్నారు.

**గుర్రం భగ్గీలో పట్టు వస్త్రాలతో..**

ఖైరతాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 75 అడుగుల కండువా, జంధ్యం, గరికమాల, పట్టువస్త్రాలను గుర్రం భగ్గీలో ఉంచి, ఒగ్గుడోలు, గుస్సాడి నృత్య, కోలాట కళారూపాలతో ఊరేగింపు నిర్వహించి ఉదయం 7గంటలకు స్వామి వారి వద్దకు చేరుస్తారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్ధసారథి, గవర్నర్ కార్యదర్శి సురేంద్ర మోహన్, అడిషనల్ కమిషనర్ పి.విశ్వప్రసాద్, డీసీపీ రూపేశ్, అడ్వకేట్ జనరల్ బండా శివానంద ప్రసాద్ హాజరై కానుకలను సమర్పిస్తారు.



**పకడ్బందీగా ఏర్పాట్లు**

ఖైరతాబాద్ గణపతిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో పకడ్బందీగా బారికేడ్లతో క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జీహెచ్ఎంసీ, జలమండలి తదితర శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయగా, పారిశుధ్య కార్యక్రమాలకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తులకు అస్వస్తత లాంటివి చోటు చేసుకుంటే వెంటనే వారికి వైద్య సేవలందించేందుకు తగిన శిబిరాలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచారు.

**మహాగణపతి దర్శనానికి దారులు**

మహా గణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఐమాక్స్ మీదుగా వచ్చే వారు గజ్జెలమ్మ దేవాలయం గల్లీ నుంచి వార్డు ఆఫీసు మీదుగా, సెన్సేషన్ థియేటర్, రైల్వే గేటు మార్గం ద్వారా వచ్చి దర్శనం అనంతరం మింట్ కాంపౌండ్ రూట్‌లో వెళ్లేలా క్యూలైన్లను పెట్టారు. స్థానిక భక్తుల కోసం వెనుక వైపు దారి ఉంచారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేందుకు పోలీసులతో పాటు వలంటీర్లు సహాయ పడుతారు.

300మంది పోలీసులు.. 70సీసీ కెమెరాలతో నిఘా

ఖైరతాబాద్ గణేశుడి దర్శనానికి ప్రతి ఏడాది నవరాత్రుల్లో సుమారు 20లక్షల నుంచి 30లక్షల మంది భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వార్డు ఆఫీసు, రైల్వే గేటు, మింట్ కాంపౌండ్, బడా గణేశ్ వెనుక వైపు నలుదిక్కులా సుమారు 70సీసీ కెమెరాలను అమర్చారు. ఇద్దరు ఏసీపీలు, సీఐల పర్యవేక్షణలో 300 మంది పోలీసు సిబ్బందితో భద్రత కల్పిస్తున్నారు. అడుగడుగునా మెటల్ డిటెక్టర్లతో పాటు ఎనిమిది డోర్ ఫ్రేమ్ డిటెక్టర్లను ఇప్పటికే అమర్చారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే దర్శనానికి పంపిస్తామని ఖైరతాబాద్ సీఐ బాల్‌గోపాల్ తెలిపారు.

# లోకేశ్‌నూ అరెస్టు చేస్తే.. బరిలోకి బ్రాహ్మణి!

(మొదటి పేజీ తరువాయి)

'నారా' వారి కోడలు, నందమూరి ఆడపడుచు బ్రాహ్మణి రంగంలోకి దిగి పార్టీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బహుశా వచ్చే వారంలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. స్కిల్ స్కామ్ పేరుతో చంద్రబాబును ఇప్పటికే అరెస్టు చేశారు. రిమాండ్‌ను అక్రమంగా ప్రకటించి, దానిని కొట్టివేయాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరగనుంది. ఈ ప్రక్రియను వీలైనంత కాలం పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. కోర్టు నిర్ణయం ఎలా ఉన్నప్పటికీ, రకరకాల కేసులను తెరపైకి తెచ్చి వీలైనన్ని రోజులు ఆయనను జైలులో ఉంచాలన్నదే వైసీపీ పెద్దల వ్యూహం. సీఐడీ అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణం పేరుతో ఆయనపై మరో వారెంటు సిద్ధం చేసింది. ఇదిలా ఉండగానే.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా)ను కూడా అరెస్టు చేసేందుకు సీఐడీ రంగం సిద్ధం చేసింది. 'ఫైబర్ గ్రిడ్ కుంభకోణం పేరుతో చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ప్రస్తుత ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ చైర్మన్ గౌతం రెడ్డి ) ఫిర్యాదుతో ఈ కేసు మొదలైంది. ఇందులో ఇప్పటికే సీఐడీ నలుగురిని అరెస్టు చేసింది. వారందరికీ బెయిలు వచ్చింది. దీంతో... ఎప్పుడో ఈ కేసు ఆగిపోయింది. ఇప్పుడు దానిని తిరగదోడుతున్నట్లు సమాచారం.

**సంబంధం లేకున్నా...**

ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్‌తో లోకేశ్‌కు ఎలాంటి సంబంధంలేదు. ఒప్పందాల అమలులోనూ ఆయన పాత్ర లేదు. ఆయన అప్పట్లో పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రిగా పని చేశారు. ఫైబర్ గ్రిడ్ పరిశ్రమలు-మౌలిక సదుపాయాల విభాగం (ఐ అండ్ ఐ) పరిధిలోనిది. అయితే... ఐ అండ్ ఐ చూసిన అధికారే ఐటీ కార్యదర్శిగా కూడా ఉన్నారు. ఆయన ఒక అధికారిక పనిమీద ఢిల్లీ వెళ్లేందుకు ఐటీ మంత్రి హోదాలో లోకేశ్ అనుమతి ఇచ్చారు. అంతకుమించి ఇంకేం లేదు. అయితే... లోకేశ్‌ను ఇరికించడమే లక్ష్యంగా రకరకాల కథలు అల్లారు. ఈ-గవర్నెన్స్ పాలక మండలి సభ్యుడిగా ఉన్న వేమూరి హరిప్రసాద్‌కు టెరాసాఫ్ట్ సన్నిహిత కంపెనీ అని ఆరోపించారు. ఫైబర్‌గ్రిడ్‌కు అవసరమైన సిబ్బంది నియామకానికి షెల్‌కంపెనీ ఏర్పాటు చేశారన్నారు. అందులోనూ... విదేశాల్లో ఉన్న వేమూరి హరిప్రసాద్ కుమార్తెకు 1.35 లక్షల జీతం చెల్లించారని, ఆయన భార్య పేరిట ఒక ఫ్లాట్ కొనేందుకు రూ.39 లక్షలు అడ్వాన్స్ కూడా చెల్లించారని ఆరోపించారు. మొత్తంగా ఇది 284 కోట్ల రూపాయల స్కామ్ అని 'తేల్చారు'. ఈ కేసులో అప్పట్లో ఐ అండ్ ఐ అధికారిగా పని చేసిన (రైల్వే నుంచి డిప్యుటేషన్‌పై వచ్చారు) సాంబశివరావుతోపాటు నలుగురిని అరెస్టు చేశారు. వీరందరికీ హైకోర్టు బెయిల్ ఇచ్చింది. కేసు కూడా అక్కడితో ఆగిపోయింది.

# కరువు నేలకు.. 'కృష్ణా'భిషేకం

(మొదటి పేజీ తరువాయి)

దశాబ్దాలుగా దుర్భిక్షంతో తల్లడిల్లుతున్న ఈ ప్రాంతాల ప్రజల దశ మార్చే మహత్తర పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. ఆ ప్రాంతంలో 68 చెరువులను కృష్ణా జలాలతో నింపే పథకం ఫలాలను సీఎం వైఎస్ జగన్ రైతులకు అందిస్తుండటం కర్నూలు, నంద్యాల జిల్లాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదిగా సామాజికువేత్తలు ప్రశంసిస్తున్నారు. ఈ మహత్తర ఆశయంతో రూ.224.31 కోట్ల వ్యయంతో చేపట్టిన 77 చెరువులను నింపే పథకాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. ఈ పథకం వల్ల డోన్, పత్తికొండ, పాణ్యం, ఆలూరు నియోజకవర్గాల్లో నేరుగా 10,394 ఎకరాలకు నీళ్లందించనున్నారు. చెరువులు నింపడం వల్ల భూగర్భ జల మట్టం పెరుగుతుంది. దాంతో బోరు బావుల్లోనూ నీటి లభ్యత పెరుగుతుంది. దీని వల్ల వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతా యి. తాగునీటి ఇబ్బందులు తీరతాయి. దుర్భిక్షానికి, వలసలకు పెట్టింది పేరైన ఆ ప్రాంతంలో జీవనోపాధులు పెరుగడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. దాంతో వలసలకు పూర్తిగా అడ్డుకట్ట పడనుంది. డోన్, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో ఎక్కడ చూసిన బోడి కొండలు, గుట్టలతో నిండి ఉంటుంది. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం ఇది. కొండలు, గుట్టల మీద కురిసిన వర్షపు నీరు వేగంగా కిందకు ప్రవహించడం వల్ల భూమిలోకి ఇంకని పరిస్థితి. ఫీడర్ ఛానల్స్ (వంకలు, వాగులు) సక్రమంగా లేకపోవడం వల్ల ఆ ప్రాంతంలో చెరువులు నిండని దుస్థితి. సాగునీటి మాట దేవుడెరుగు.. గుక్కెడు తాగునీళ్లకూ కరువే. దాంతో కుటుంబాన్ని పోషించుకోవడం కోసం బిడ్డలను, వృద్ధులైన తల్లిదండ్రులను ఇంట్లో వదిలి.. భార్యాభర్తలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్లడం ఆ ప్రాంతంలో నిత్యకృత్యం. పాదయాత్రలో ఆ ప్రాంతాల ప్రజల కష్టాలు కళ్లార చూసిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్.. అధికారంలోకి రాగానే కృష్ణా జలాలతో చెరువులను నింపి, సుభిక్షం చేయటం ద్వారా వలసలకు అడ్డుకట్ట వేస్తానని హామీ ఇచ్చారు.

# మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్టిద్దాం..

**. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**




**హైదరాబాద్ సమ సమాజం:** మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్టిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అని అంబర్పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఈరోజు ఓల్డ్ నల్లకుంట లో హైదరాబాద్ జిందాబాద్, నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ మాట్లాడుతూ పిఓపి, అనేక రకాల రసాయనాలతో తయారుచేసిన పెద్ద పెద్ద విగ్రహాలు చెరువులలో వేయడం వల్ల నిండిపోవడం, కాలుష్యానికి గురి కావడం జరుగుతున్నదని అన్నారు. పిఓపి విగ్రహాల తయారీలో ప్లాస్టిక్ పాదరసం, సీసం, క్రోమియం,వార్నిస్ లాంటి అనేక విష రసాయనాలు ఉంటాయని, వీటివల్ల అనేక రోగాలకు కారణం అవుతాయని అన్నారు. అందరు మట్టి గణేష్ లనే ప్రతిష్టించాలని, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిందాబాద్ పర్యావరణాన్ని కాపాడడానికి మట్టి విగ్రహాల పంపిణీ చేయడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ కొండారెడ్డి , నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ రావు , ప్రధాన కార్యదర్శి మోహన్ నాయుడు, నాయకులు శంకరం, రాజీవ్, రిటైర్డ్ సి ఈ రామకృష్ణారావు, కృష్ణ బాబు, డాక్టర్ అమర్నాథ్, శ్రీనివాసరావు, రితేష్, కిరణ్, రమణ, శివకుమార్, వేణుగోపాల్ రాంకుమార్, అజయ్ రెడ్డి, సంజయ్, రాజేష్, వినోద్ జై, గోపాల్, సంగీత, సుకుమార్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు

# ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించాలి.

**తొర్రూర్ సమ సమాజం:** ఎం ఈ ఎఫ్ తొర్రూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గెస్ట్ హౌస్ లో చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించడమైనది తదుపరి జరిగిన సమావేశంలో ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమవారపు ఐలయ్య మాదిగ మరియు రాష్ట్ర నాయకులు టి సురేందర్ మాదిగ కే బిక్షపతి మాదిగలు మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుండి 22 వరకు జరిగే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమారపు ఐలయ్య మరియు రాష్ట్ర నాయకులు తాటికాయల సురేందర్ . కుంట కొమ్ము బిక్షపతి మాదిగలు డిమాండ్ చేశారు . గత 29 సంవత్సరాలుగా ఎంఆర్పిఎస్ మందకృష్ణ మాది గారి నాయకత్వంలో ఎస్సీ ఎబిసిడి వర్గీకరణ కోసం ఉద్యమాలు చేస్తున్న క్రమంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం 100 రోజులలో ఏబిసిడి వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదు ఇది మాదిగల పట్ల ఒక వివక్షతకు నిదర్శనం మాట ఇచ్చిన బిజెపి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇప్పటికైనా నేడు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఏబిసిడి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి అమలు పరచాలని డిమాండ్ చేస్తున్నాం ఈ వర్గీకరణ ద్వారా ఎస్సీ కులాలు ఉండబడిన అన్ని వర్గాలకు



సామాజిక న్యాయం సమానత్వం జరుగుతుందని అన్నారు కాబట్టి వెంటనే బిల్లును ప్రవేశపెట్టి అమలుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ రాష్ట్ర జిల్లా నాయకులు టి సురేంద్ర మాదిగ మహంకాళి బుచ్చయ్య మాదిగ ఈదురు రమేష్ మాదిగ కే బిక్షపతి మాదిగ గుండాల రంజిత్ మాదిగ బంద్ యాకయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు

# స్వరాష్ట్రంలో 9 ఏళ్లలో సాధించిన అద్భుత ప్రగతిని కొనసాగించాలి

**రాష్ట్ర శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్,**

**జాతీయ సమైక్యతను చాటేలా ఘనంగా జరిగిన వేడుకలు**

**సంక్షేమం అభివృద్ధి దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు**

**విద్యుత్, త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాం**

**జాతీయ పతాకావిష్కరణ చేసిన రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్**



**పెద్దపల్లి సమ సమాజం:** స్వరాష్ట్రంలో ఐక్యతతో గత తొమ్మిది సంవత్సరాలలో అద్భుత ప్రగతి సాధించామని, దేశానికి ఆదర్శంగా సాధించిన అద్భుత ప్రగతిని కొనసాగించాలని రాష్ట్ర శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి.భాను ప్రసాద్ రావు అన్నారు. ఆదివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి.భాను ప్రసాద్ రావు గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ 75 సంవత్సరాల క్రితం ఇదే రోజున మన తెలంగాణ భారతదేశంలో అంతర్భాగంగా మారిందని అన్నారు. దీనిని పురస్కరించుకొని జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నా మని తెలిపారు. జాతీయ సమైక్యత అంటే భౌగోళిక సమైక్యత మాత్రమే కాదని, ప్రజల మధ్య సమైక్యత, విభిన్న సంస్కృతుల మధ్య సమైక్యతని తెలిపారు. దేశం అనుసరిస్తున్న జీవన సూత్రం భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడడమే నిజమైన దేశభక్తని తెలిపారు. సుదీర్ఘ పోరాటం, అమరుల త్యాగ ఫలితం ఆధారంగా ప్రత్యేక తెలంగాణను సాధించామని, గత 9 సంవత్సరాలలో అనేక రంగాల్లో అగ్రగామిగా ఉంటూ దేశానికే ఆదర్శవంతంగా నిలిచామని అన్నారు. ప్రజల మధ్య ఐక్యతతో తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధిని ఇలాగే కొనసాగిస్తూ, మరింత అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రాంత ప్రజలను అనేక దశాబ్దాల పాటు ఇబ్బందికి గురిచేసిన విద్యుత్, త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, అన్ని వర్గాల వారికి నిరంతరాయంగా కోతలు లేని విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 1000 కి పైగా రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసామని, వాటిని జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసుకున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అద్భుత పురోగతి సాధించిందని, తెలంగాణ ప్రాంతానికి ఆయువు పట్టు లాంటి కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి భారీ ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నామని, నిన్న పాలమూరు ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ప్రారంభించారని అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగు చేయడం, చెక్ డ్యాంల నిర్మాణం వల్ల చిన్న నీటి వనరుల రంగాన్ని బలోపేతం చేశామని అన్నారు. రైతు సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమా, 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా, రైతు వేదికల నిర్మాణం వంటి అనేక పథకాలను అమలు చేస్తోందని, దేశంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ మాత్రమేనని అన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో అన్ని రంగాలలో అద్భుత పురోగతి సాధించి, దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలవడంలో ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని, భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ పుట్ట మదూకర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే కోరుకుంటి చందర్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డిసిపి వైభవ్ గైక్వాడ్, అదనపు కలెక్టర్ లు జే.అరుణశ్రీ, శ్యాం ప్రసాద్ లాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక-రాజనర్సు, ఏ.సి.పి. లు, పోలీస్ అధికారులు, ఎంపీపీ లు, జడ్పీటీసీ లు, కౌన్సిలర్ లు, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ పెద్దపల్లి పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి**




**పెద్దపల్లి సమ సమాజం:** స్వచ్ఛ భారత్ దివాస్ స్వచ్ఛత హై సేవ 2023 ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా మినీ ట్యాంక్ బంద్ పై నిర్వహించిన కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ దివాస్ స్వచ్ఛత హై సేవ 2023 కార్యక్రమంలో కౌన్సిలర్లతో కలిసి పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ రైల్వే స్టేషన్, మినీ ట్యాంకు బండ్ (ఎల్లమ్మ గుండమ్మ చెరువు) పై చెత్త సేకరించడం జరిగిందని, అలాగే పెద్దపల్లి పట్టణాన్ని స్వచ్ఛ పెద్దపల్లి గా తీర్చి దిద్దడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని, పెద్దపల్లి పట్టణాన్ని నా పట్టణం నా ఇల్లు నా పరిసరాలు అనుకున్న రోజు స్వచ్ఛత వైపు ఒక అడుగు ముందుకు వేసినట్లేనని, అలా చేయడం ద్వార పెద్దపల్లి పట్టణం స్వచ్ఛ పెద్దపల్లి గా తయారవుతుందని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని, స్వచ్ఛత వైపు నేను వెళ్తున్నాను మీరు నాతో రండి అని అన్నారు. చైర్ పర్సన్, కౌన్సిలర్లు కో-ఆప్షన్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ కి వారి సిబ్బందికి పాల్గొన్న కౌన్సిలర్లకు కో ఆప్షన్ సభ్యులకు, మున్సిపల్ సిబ్బందికి,మెప్మా సిబ్బందికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం చైర్ పర్సన్ కాలుష్య రహిత మట్టి గణపతులను గౌరవ కౌన్సిలర్లు కు పట్టణ ప్రజలకు మున్సిపల్ సిబ్బందికి, మెప్మా సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆకుల వెంకటేష్ మట్ట శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, మున్సిపల్ సిబ్బంది మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



# ఆనాటి పోరాటాల త్యాగాల ఫలితమే నేటి సుసంపన్నమైన తెలంగాణ

**మంత్రి పట్నం మహేందర్ రెడ్డి**

**వికారాబాద్ సమ సమాజం:** ఆనాటి పోరాటాల త్యాగాల ఫలితమే నేటి సుసంపన్నమైన అభివృద్ధి చెందిన తెలంగాణ అని మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ సమైక్యత దినోత్సవం వేడుకల్లో వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి లతో కలిసి వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన జాతీయ సమైక్యత దినోత్సవం వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, వారికి బహుమతులు అందజేసి, వికలాంగులకు మోటర్ సైకిళ్ళ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వికారాబాద్ నియోజకవర్గ, జిల్లా ప్రజలకు జాతీయ సమైక్యత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17, బి.ఎస్. పి తెలంగాణ పునర్విముక్తి ప్రతిజ్ఞ దివస్ నిర్వహణ

**ఈదునూరి ప్రసాద్ పాలకుర్తి నియోజవర్గ ప్రధాన కార్యదర్శి**



**తొర్రూర్ సమ సమాజం:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కేంద్రంలో ఆదివారము రోజున బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్యమంత్రి అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు తెలంగాణ పునర్విముక్తి ప్రతిజ్ఞ దివస్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈదునురి ప్రసాద్ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15 న భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ తెలంగాణ ప్రాంతం హైదరాబాద్ సంస్థానంగా నిజాం పరిపాలనలో కొనసాగుతుంది. ఇతని పరిపాలనలో పేద వర్గాలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల పై హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, దోపిడీ విచ్చలవిడిగా జరిగాయి. ఆ దోపిడీ పాలనను నిర్మూలించడానికి ఎందరో ప్రాణాలకు ఎదురొడ్డి పోరాటం చేశారు. తత్ఫలితంగా 1948 సెప్టెంబర్ 17 న నిజాం యొక్క నిరంకుశత్వ పాలన నుండి హైదరాబాద్ సంస్థానం భారతదేశము లో అంతర్భాగమైందని ఆయన తెలిపారు.

# తెలంగాణ విమోచన దినోత్సవ జాతీయ జెండా పతాక ఆవిష్కరణ

**గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్..**



**ఎల్బీనగర్సమ సమాజం:** తెలంగాణ విమోచన దినోత్సవ సందర్భంగా వివేకానంద నగర్ బస్టాప్ వద్ద గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి జాతీయ పథకాన్ని ఎగరవేశారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భారతదేశాన్ని ఏకం చేయడానికి సర్దార్ పటేల్ చేసిన గొప్ప కృషికి ఉదాహరణ సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం అన్ని అన్నారు. 1948లో ఇదే రోజు హైదరాబాద్ భారతదేశంలో అంతర్భాగమైంది. దేశ ప్రగతి ప్రయాణంలో ఈ ప్రాంతం బలమైన భాగస్వామిగా అవతరించింది అన్ని తెలియజేసారు. నాయకులకు, కాలనీ వాసులకు తెలంగాణ విమోచన దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అలాగేయ్ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగేయ్ తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలో పాల్గొని కార్యక్రమం విజవంతం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చిలకూరి రామ రెడ్డి , సుధాకర్ రెడ్డి, ఆనంద్ కుమార్, భీష్మాచారి, లక్ష్మీదేవి, కేశవ్ , సుబ్బారెడ్డి, పి.వి నరసింహారావు , మురళి, ఒట్టే రాజు, డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్ , శ్రీధర్ రెడ్డి ,రూపులాల్, శివరాం, సుజాత, వెంకట్ రెడ్డి, నాగేష్, రత్నం మరియు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం జాతీయ జెండా ఆవిష్కరణ

**దంతాలపల్లి సమ సమాజం:** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ లో ఎంపీపీ ఓలాద్రి ఉమా మల్లారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏకం చేయడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన గొప్ప కృషిని సెప్టెంబర్ 17 1948లో హైదరాబాద్లో భారతదేశం అంతర్భాగమైందని ప్రగతి ప్రయాణంలో ఈ ప్రాంతంలో బలమైన భాగస్వామిగా అవతరించడానికి అన్ని దేశం ప్రయత్న నడవడానికి ఈ ప్రాంతం బలమైన భాగస్వామిగా అవతరించిందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో జడ్పీ వైయస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్ రెడ్డి ఎంపీడీవో విజయలక్ష్మి టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ధర్మారం వేణు కిషోర్ వివిధ గ్రామాల సర్పంచ్లు ఎంపీటీసీలు పాల్గొన్నారు

# తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తాం

**-బిజెపి,బిఆర్ఎస్ లకు సాయుధ పోరాటంతో సంబంధం లేదు**

**కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే తెలంగాణ విముక్తి**

**ఎంసిపిఐ(యూ)తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవి**




**శేరిలింగంపల్లి, సమ సమాజం:** తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని ఎంసిపిఐ(యూ)రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు.ఆదివారం హైదరాబాద్ బాగ్ లింగం పల్లి ఓంకార్ భవన్ బి యన్ హాల్ లో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల ముగింపు సభ ఎంసిపిఐ(యు) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కామ్రేడ్ మైదంశెట్టి రమేష్ అధ్యక్షతన జరిగింది. మొదట యంసిపిఐయు పోలీట్ బ్యూరో సభ్యులు,తెలంగాణ సాయుధ పోరాట యోధులు భీమిరెడ్డి నరసింహారెడ్డి చిత్ర పటానికి యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అమరజీవి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు యంసిపిఐ(యు) వ్యవస్థాపక నేత కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ చిత్ర పటానికి అమరజీవి బియన్ కూతురు రాజేశ్వరి పూలమాలవేసి జోహార్లు అర్పించారు.అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల లక్ష్మక్క చిత్ర పటానికి పార్టీ రాష్ట్ర నాయకురాలు కామ్రేడ్ తాండ్ర కళావతి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సభకు హాజరైన వారందరూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల అందరికీ సమావేశం 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు తదనంతరం జరిగిన వార్షికోత్సవ సభలో యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన పోరాటం మూలంగానే ప్రజలకు దోపిడీ, పీడనల నుండి విముక్తి కలిగిందన్నరు.నిజాం పాలనలో భూములన్నీ దొరలు,జాగీర్దార్లు, జమీందార్ల చేతుల్లో ఉండేవని,వారికి వ్యతిరేకంగా భూమి,భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం సాగించి పది లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేసిందన్నారు.సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధంలేని బీజేపీ వాస్తవ చరిత్రను వక్రీకరిస్తోందని విమర్శించారు.భీంరెటడ్డి నర్సింహ్మా రెడ్డి, మద్దికాయల ఓంకార్ మద్ది కాయల లక్ష్మక్క బొమ్మగాని ధర్మ బిక్షం దేవులపల్లి వెంకటేశ్వరరావు పుచ్చలపల్లి సుందరయ్య చిట్యాల ఐలమ్మ దొడ్డి కొమరయ్య మల్లు స్వరాజ్యం లాంటి కమ్యూనిస్టు యోధులు సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారన్నారు. సాయుధ పోరాటానికి సంబంధం లేని బీజేపీ ఆ పోరాటాన్ని హిందూ, ముస్లింల పోరాటంగా చిత్రీకరించడం దుర్మార్గమన్నారు. ఆనాడు పల్లెల్లో దొరలు జమిందార్లు చేస్తున్న ఆగడాలను ఎదిరించి పోరాటాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు లదేనని అన్నారు.ఎన్నికల్లో ఓట్ల కోసం హిందూ మతాన్ని రెచ్చగొట్టడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. ప్రజలు అధిక ధరలు, నిరుద్యోగం, రైతులకు మద్దతు ధర,రాజ్యాంగ పరిరక్షణ,మహిళా రిజర్వేషన్లు, విద్య,వైద్యం, ఉపాధి అవకాశాలపై పోరాటాలు సాగించాలని ప్రజలను కోరారు. వెట్టిచాకిరీ నుండి విముక్తి కల్పించడం కోసం ఆనాడు నిజాం నవాబును తరిమికొట్టిన స్ఫూర్తితో దేశంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న మోడీని గద్దె దించేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు.నిజాం లొంగిపోయేలా పోరాడిన కమ్యూనిస్టుల త్యాగాలను గుర్తించకుండా బీజేపీ,కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి పార్టీలు తామేదో చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్నాయన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి బిజెపి,బిఆర్ఎస్ పార్టీలకు సంబంధం లేదన్నారు. కమ్యూనిస్టులు నిర్వహించిన పోరాట ఫలితంగా పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి ఇచ్చిన ఘనత కమ్యూనిస్టులకే దక్కిందన్నారు.ఈ పోరాటంలో నాలుగు వేల మందిబలిదానంతో తెలంగాణ విముక్తి అయిందన్నారు. 3000 గ్రామాలకు వెట్టి నుండి విముక్తి అయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్ఫూర్తితో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా,ప్రజలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు .ఈ సభ లో అమరజీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహ రెడ్డి కూతురు రాజేశ్వరి మాట్లాడుతూ నాటి నాయకత్వం విలువలు కాపాడటం కోసం దోపిడీ అసమానతలు రూపు మాపటం కోసం పోరాడారు ఆ కోణంలో సాగిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బీం రెడ్డి నరసింహ రెడ్డి ఎంతో త్యాగం చేసారని కమ్యూనిస్టు పార్టీలు అన్ని ఐక్యం అయి ప్రజల కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాడాలి అని అన్నారు.సభానంతరం ఓంకార్ భవన్ నుండి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు ఎంసిపిఐ(యు) జెండాలు చేత భూని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టులు గాని భూమి,బుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం కమ్యూనిస్టులు పోరాడారని మతోన్మాదం నశించాలి దోపిడీ వ్యతిరేకంగా పోరాడాలంటూ నినాదాలు చేస్తూ పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, వి.తుకారాం నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర కళావతి,పి.భాగ్యమ్మ, ఏ.పుష్ప,గాదె మల్లేష్,యం.రమేశ్, టి.అనీల్ కుమార్,పి.మురళి, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.దశరథ్ నాయక్, యల్.రాజు, మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు మార్టిన్,రవీందర్ గౌడ్, మరియు యాదగిరి, లక్ష్మణ్, డి మధుసూదన్, జి లావణ్య, శివాని, లలిత, డి నరసింహ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన: ఎమ్మెల్యే ఫైళ్ల





**వలిగొండ సమ సమాజం:** గ్రామాల సమగ్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే ఫైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు.ఆదివారం మండల పరిధిలోని గోల్నేపల్లి గ్రామంలో పద్మశాలి,రజక,యాదవ,ముదిరాజ్ వడ్డెర సంఘాల కమ్యూనిటి భవనాలకు శంకుస్థాపన చేసి అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటుతో పాటు రైతు బీమా రైతు బంధు అమలు చేస్తున్న నాయకుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ అని వారన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి నూతి రమేష్ రాజ్ స్థానిక సర్పంచ్ గూడూరు శివశాంత్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ ఫైళ్ల రాజవర్ధన్ రెడ్డి పిఎసిఎస్ చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి జిల్లా నాయకులు మెగుళ్ల శ్రీనివాస్ గౌడ్ వివిధ గ్రామాల సర్పంచులు, తుమ్మల వెంకట్ రెడ్డి కీసరి రామ్ రెడ్డి మీసాల శేఖర్ మద్దెల సందీప్ వంగాల బిక్షపతి గౌడ్ కీసర సత్తిరెడ్డి జాన్ రెడ్డి బొడ్డుపల్లి ఉమా కృష్ణ జక్కా వెంకట్ రెడ్డి బోళ్ల లలిత శ్రీనివాస్ మాజీ అధ్యక్షుడు దేగల పాండరి యాదవ్ మదర్ డెయిరి డైరెక్టర్ గూడూరు శ్రీధర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి నాయకులు ఎమ్మె లింగస్వామి,కొమిరెల్లి సంజీవరెడ్డి జిల్లా నాయకులు, గుర్రం లక్ష్మారెడ్డి మాజీ మత్స్యగిరి గుట్ట చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ కాసుల మధుసూదన్ గౌడ్ నోముల మల్లేష్ యాదవ్ మార్కెట్ డైరెక్టర్ కందుల శ్రీనివాస్ మండల జనరల్ సెక్రెటరీ ఐటపాముల రవీంద్ర మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మద్దెల మంజుల కీసర్ల సత్తిరెడ్డి,కంకల కిష్టయ్య,మాద శంకర్ గౌడ్, అయిటిపాముల ప్రభాకర్, మండల సీనియర్ నాయకులు కొండూరు వెంకటేశం గౌడ్ బత్తిని సహదేవ్ గౌడ్ కంకల కిష్టయ్య గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింహా మాజీ మత్స్యగిరిగుట్ట ధర్మకర్త పోలేపాక బిక్షపతి మాజీమార్కెట్ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# "రక్తదానం మహాదానం"



**ఎల్బీనగర్ సమ సమాజం:** నిజానికి ప్రకృతిలో అత్యంత విలువైనది రక్తం.అత్యంత ఆవశక్యమైన ఈ రక్తాన్ని ఉత్పత్తి చేసే శక్తి సామర్ధ్యాలు కేవలం మన దేహానికి మాత్రమే ఉంది:ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి లింగోజిగూడా డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ నందు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వారు ఎర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంపు కార్యాలయంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు .దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మరియు మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాక్ డౌన్ కారణంగా ఎంతో మంది దాతలు రోడ్డున పడ్డ నిరుపేదల కుటుంబాలకు,మధ్య తరగతి కుటుంబాలకు వారి కడుపు నింపడానికి ముందుకొచ్చారు.అన్నం వండిపెట్టారు,నిత్యావసరాలు పంచిపెట్టారు.కానీ మరో దానాన్ని మరచిపోతున్నాము.అదే రక్తదానం.ప్రస్తుతం బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు నిండుకోవడంతో రోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది అని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు.కోవిడ్ కారణంగా రక్తదానం చేసే వారి సంఖ్య బాగా తగ్గింది.దీనితో డిమాండ్ పెరిగింది.ఈ పరిస్థితి నుండి బయట పడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.లాక్ డౌన్ వల్ల రక్తదానం చేసే వారి సంఖ్య చాలా తగ్గిందని తెలిపారు. రక్తాన్ని ప్రయోగశాలలో తయారుచేయలేం,కాబట్టి రక్తం కావాలంటే దాతలు ముందుకు రావాల్సిందే.కానీ సాదారణ ప్రజానీకంలో చాలామందికి రక్తదానం పట్ల అపోహలు ఎక్కువ.తమ ఆరోగ్యానికి ఎక్కడ ముప్పువస్తుందో అని భయపడి రక్తదానం చేయడానికి ముందుకు రావడం లేదు.ప్రతి ఒక్కరు నిర్భయంగా రక్తదానం చేయవచ్చు అని తెలిపారు.గర్భిణీ స్త్రీలకు,కిడ్నీ దయాలసిస్ బాధితులకు,తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ప్రమాదాలకు గురైనవారు,బైపాస్ సర్జరీ రోగులు,కాన్సర్ పేషెంట్స్ తదితరులకు రక్తం దొరకక ఇబ్బందులు పడుతున్నారు అని తెలిపారు.కావున ప్రతి ఒక్కరు రక్తదానం చేయండి,ప్రాణదాతలు అవ్వండి అని సుదీర్ రెడ్డి పిలుపునిచ్చారు.దాదాపు 100 మంది రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఇట్టి కార్యక్రమంలో పలు దేవాలయం కమిటీ ధర్మకర్తలు,లయన్స్ క్లబ్ సంస్థ సభ్యులు,కాలనీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు,బారాస పార్టీ సీనియర్ నాయకులు,మహిళలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

**అది గూడ సమ సమాజం:** మర్రిగూడ మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి యాస అమరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, మెందు దీపికా రెడ్డి, పాతులూరు రాజేందర్ నాయక్, చిలువేరు వెంకటయ్య, బోయపల్లి రాజు గౌడ్,వేనేపల్లి శ్రీనివాసరావు, జమ్ముల వెంకటేష్ గౌడ్,ఎలిమినేటి సత్తిరెడ్డి, కీసర ముత్యంరెడ్డి, మేతరి శంకర్, జిల్లా కిషోర్, రావుల రాములు గౌడ్, చెల్లం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



**మద్దిరాల సమ సమాజం:** స్థానిక కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ రాంపాక మంజుల భర్త శ్రీ. రాంపాక సైదులు ఇటీవల అనారోగ్యంతో మరణించగా, తుంగతుర్తి శాసనసభ్యులు డా. గాదరి కిశోర్ కుమార్ 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం పంపించగా , వారి ఆదేశానుసారం ఈరోజు జిల్లా రైతుబంధు సమితి కో ఆర్డినేటర్ శ్రీ. %బాూ% రజాక్ వారి కుటుంబ సభ్యులకు 25 వేల రూపాయలు మరియు లేబర్ ఇన్సూరెన్స్ పత్రాలు అందచేసినారు..ఈ కార్యక్రమంలో పార్టీ కార్మిక విభాగం తుంగతుర్తి నియోజకవర్గ ఇంచార్జి గౌడిచర్ల సత్యనారాయణ, గూడ వెంకట్ రెడ్డి,వడ్డాణం మధుసూదన్, మల్లాల నర్సయ్య,యల్లు శివా రెడ్డి,శేరి సోమిరెడ్డి, దామోదర్ రెడ్డి,వెంకట్ రెడ్డి, మోహన్ రెడ్డి,చామకూరి మల్లయ్య, సూర అప్పరాములు, మట్టిపెల్లి అశోక్, నలమాస రాములు,కొలగాని వెంకన్న, మట్టిపెల్లి లింగయ్య, చామకురి నాగరాజు, మల్లాల రాంమూర్తి,పాక వీరయ్య, భూతం సాయిలు,పాక సోమలింగం,నరేష్ ,పాల్వాయి లింగయ్య, రాంపాక సతీష్, రవి, మురళి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# యాచారంలో 7వ రోజు అంగన్వాడి నిరవధిక సమ్మె

**అంబేద్కర్ చౌరస్తా ర్యాలీ సాగర్ రహదారి పై రాస్తారోకో**

**యాచారం,సమ సమాజం:** సాగర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలపడం జరిగింది. అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేల ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్ చందు నాయక్ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షురాలు రాజలక్ష్మి డిమాండ్ చేశారు. సిఐటియు ఎఐటియుసి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త సమ్మె అంగన్వాడి సమ్మె సందర్భంగా. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్ చందు నాయక్, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షురాలు రాజలక్ష్మి మాట్లాడుతూ 2023 ఆగస్టు 13న హైదరాబాదులో కార్మిక సంఘాలు సమావేశమై అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం నిరవధిక సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాయి. ఈ ఒత్తిడి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్ మంత్రి సత్యవతి రాథోడ్ 2023 ఆగస్టు 18న హైదరాబాదులో అన్ని సంఘాలతో జాయింట్ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో డిమాండ్లపై చర్చించి కొన్నిటిపైన నిర్దిష్టమైన హామీలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గతం కంటే వేతనాలు పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, టీచర్లకు 2లక్షలు హెల్పర్లకు 1లక్ష, ఆసరా పెన్షన్ ఇస్తామని, 2లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. మినీ సెంటర్స్ అన్నిటిని మెయిన్ సెంటర్ గా మారుస్తామని అంగన్వాడి ఉద్యోగులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఆన్లైన్ యాప్ ఒకటే ఉంచుతామని మిగతా వాటిని రద్దు చేస్తామన్నారు. అంగన్వాడి ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తించే విధంగా సర్క్యులర్ జారీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అంగన్వాడిలో పని చేసే వారు మరణిస్తే 20వేలు మట్టి ఖర్చు ఇస్తామని ప్రతినెల 14వ తేదీన వేతనాలు చెల్లిస్తామన్నారు. ఇతర సమస్యలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ అంశాలన్నిటిని ఇప్పటివరకు ఆర్థిక మంత్రి హరీష్ రావు గారితో చర్చించి వచ్చామని కచ్చితంగా ఇవన్నీ అమలు చేస్తామని 10రోజుల్లో వేతనం పెంచుతూ ప్రకటన కూడా వస్తుందని మంత్రిగారు హామీ ఇచ్చారు. దీంతో సిఐటియు ఏఐటీయూసీ సంఘాలు సమ్మె ఆలోచన విరమించుకోవాలని మంత్రి గారి కోరిక మేరకు సమ్మె తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగింది. ఇచ్చిన హామీలకు భిన్నంగా అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించడంతో పాటు వేతనాల పెంపు ఇతర సమస్యల పైన ప్రకటన రానందున కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 2023 ఆగస్టు 28న ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందజేసి చట్టపరంగా ఈ సమ్మెను కొనసాగిస్తున్నామని వారు తెలిపారు. కనుక అంగన్వాడి సమస్యల పరిష్కారం కోసం చర్చలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఆయాల నాయకులు యాదమ్మ, అండాలు, హేమలత ,విజయలక్ష్మి, పద్మ , చాంద్ సుల్తానా, విమల ,రమణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.




Edited, Printed, Published & owned by GOSUKONDA PRUDHVIRAJU, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar PUBLICATIONS. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: GOSUKONDA PRUDHVIRAJU,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in